# మనోరమ నవ్వీన

హనుమకొండలో జూనియర్ లెక్చరర్‌గా అపాయింట్‌మెంట్ వచ్చిందని తెలియగానే చాలా సంతోషించాను. ఉదయం ఆరు గంటలకు సికింద్రాబాద్‌లో రైలెక్కి ఎనిమిది న్నరకల్లా కాజీపేటలో దిగి సిటీ బస్ కోసం ఎదురుచూడసాగా

బస్‌స్టాప్‌లో నిల్చున్న నా పక్కనే ఓ అంబాసిడర్ కారొచ్చి ఆగింది. స్టీరింగ్ ముందు కూర్చున్న వ్యక్తి నాకు బాగా తెలిసిన వాడిలాగే కనిపించాడు. కాని అతని పేరు నాకు గుర్తు రాలేదు.

అతడు నన్ను చూసి నవ్వుతూ "యే మామా! చాలా రోజులకు కనిపిస్తివి... బాగున్నావా?" అన్నాడు.

అతడెవరో నాకు వెంటనే గుర్తొచ్చింది.

"వరే మోహన్! నువ్వా? వెంటనే పోల్చుకోలేక పోయాను" అన్నాను చాలా ఎక్సైటయిపోయి.

అట్లనే ఉంటది లేరా! ఈ పల్లెటూరోళ్ళు మీకెక్కడ జ్ఞాపకం ఉంటరులే... యేం సంగతి? మా ఊరికెందుకో వచ్చినవూ?" అన్నాడు మోహన్.

ఇప్పట్నుంచి ఇక మీ ఊళ్ళోనే ఉంటాను. ఇక్కడ జూనియర్ కాలేజీలో ఉద్యోగం వచ్చింది. ఈ రోజు జాయిన్ కావటానికి వెళ్తున్నా.

"ఎంత శుభవార్త చెప్పావురా మామా! నీలాంటి దోస్త్ లేక చచ్చిపోతున్నా... చాలా రోజులకు మనం మళ్ళీ కలిసి తిరిగే ఛాన్సొచ్చిందంటే నమ్మలేకపోతున్నా. నేనూ అటే పోతున్నా... రా... కూర్చో" అన్నాడు మోహన్ డోర్ తెరిచి

నేను కారెక్కి అతని పక్కనే కూర్చున్నాను.

మోహన్ కారు స్టార్ట్ చేసి ముందుకు పోనిచ్చాడు.

"ఈ కారెప్పుడు కొన్నావురా?" అన్నాను.

"కారెక్కి హాయిగా షికారు కొట్టడానికి కొన్నాననుకుంటున్నావా యేంది? బతుకు తెరువుకోసం కొన్న. బ్యాంకోడు సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ స్కీమ్ కింద లోనిస్తే కొన్న. కిరాయకు నడుపుతున్న..."

"అదా సంగతి... నీవు కారు కొనేటంత ధనవంతుడెప్పుడయ్యావా అని ఆశ్చర్య పడ్తున్నా. అది సరేగానీ... ఎలా ఉన్నావురా మోహన్? హౌ ఈజ్ లైఫ్?"

"యేం లైఫ్‌రా మామా! చాల ఘోరంగుంది. ఈ లైఫ్ కంటె ఎడారి నయం"

"అదేమిట్రా బాబూ! ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ హాయిగా తిరిగేవాడివి-పాతికేళ్ళు కూడా నిండలేదు. అప్పుడే బతుకను గూర్చి అంత నిర్లిప్తంగా మాట్లాడుతున్నావేమిటి? ఇప్పటికీ అప్పటికీ నీ జోక్స్ గుర్తొస్తే భలే నవ్వొస్తుంది..."

"ఈ భూమ్మీద పుట్టినప్పట్నుంచి ఎప్పుడన్న హాయిగున్ననంటే అప్పుడే... మనం కాలేజిల చదివిన రోజులల్లనే"

"అసలు నువ్వు స్టడీస్‌ను కొంచెం సీరియస్‌గా తీసుకుని ఉంటే బావుండేది. ఇప్పుడేదైనా మంచి ఉద్యోగం దొరికేది. ఎప్పుడూ పదిమందితో కలిసి తిరుగుతూ స్టడీస్‌ను నిర్లక్ష్యం చేశావు. నువ్వు మాతోబాటు అప్పుడే బి.ఏ ప్యాసు కాకపోవటం..."

నా మాట పూర్తి కాకుండానే మోహన్ అందుకున్నాడు.

"చదువు అందరికీ రాదురా మామా! హైస్కూళ్ళనయితే అడిగేటోడు లేక కాపీగొట్టి టెన్త్ ప్యాసయితివి. జూనియర్ కాలేజిల కొంచెం స్ట్రిక్ట్ చేసిండ్రు. అందుకే రెండుసార్లు తప్పి చివరకు ఎలాగో పూర్తయిందనిపించాను. కానీ డిగ్రీ కాలేజిల్లో అంత స్ట్రిక్ట్ చేస్తరనుకోలేదు"



"ఇంతకూ బి.ఏల ఫెయిలయిన సబ్జెక్టులు మళ్ళా రాసి ప్యాసయ్యావా? లేదా?"

"ప్యాసైన కాబట్టే బ్యాంకోడు లోనిచ్చాడు" అంటూ మోహన్ రోడ్డు క్రాస్ చేస్తున్న ఓ అందమైన అమ్మాయిని చూసి హుషారుగా విజిలేశాడు.

"ఆ పిల్ల ఎంత బావుందో చూసినవా" అన్నాడు మోహన్.

ఆడ పిల్లల్ని చూసి మతి పోగొట్టుకునే అలవాటు నీకింకా పోలేదన్నమాట, బై ది బై "నువ్వు పెళ్ళి చేసుకున్నావా మోహన్?"

"యేదో చేసుకున్న లేరా? నా కోసం చేసుకున్నవనుకుంటున్నావా?"

"మరి? ఎవరి కోసం చేసుకున్నవు?"

"మరీ అంత తెలవనట్టు అడుగుతవేందిరా? ఈ దేశంల యెవొరడు గానీ పోరిగాని తన కోసం పెళ్ళిచేసుకోంగ చూసినవా? సినిమాలళ్ళనైతే ప్రేమించి తప్ప పెళ్ళిచేసుకోరు. కానీ నిజ జీవితంల అట్ల చేసుకునేటోల్ని ఒక్కని చూపెట్టు?"

"నిజ జీవితంల కూడా ప్రేమించి పెళ్ళి చేసుకునేటోళ్ళు ఉంటారు లేరా"



"నేను ఇన్నాళ్ళూ అల్లనే అనుకునేటోన్ని... అసలు పెళ్ళంటూ చేసుకుంటే నాకిష్టమైన ఓ అందమైన అమ్మాయిని ప్రేమించి చేసుకోల్లనుకున్నా... కానీ యేమైంది? మావోళ్ళు మా చుట్టాలమ్మాయినొకదాన్ని చూసి నాకు బలవంతంగా అంట గట్టింర్రు"

"పోనీయ్‌లేరా... జీవితం మనం కలలు గన్నంత మధురంగా ఉండదు-ఎట్లాగో అడ్జస్టయి పోవాలి"

"అడ్జస్టా...పాడా ఒక్కరోజా? రెండ్రోజులా? జీవితాంతం అడ్జస్టవమ్మంటే ఎవ్వని మనసు ఒప్పుకుంటుంది?" చాలా కోపంగా అన్నాడు మోహన్.

వాడి మాటల్లో కనిపించిన తీవ్రమైన అసహనం నన్ను ఆశ్చర్యపరచింది.

ఇంతలో మా కాలేజి వచ్చేసింది.

"సరె-నా సంగతి వదిలెయ్-నీకు పెళ్ళయిందిరా రఘూ?" అన్నాడు మోహన్ కారు ఆపుతూ

నేను డోర్ తెరుచుకొని బయటకు దిగుతూ అన్నాను.

'ఇంకా కాలేదురా"

'వరే మామా! నువ్వైనా ప్రేమించి పెళ్ళి చేసుకోరా!' నేను నవ్వి ఊరుకున్నాను.

"కాలేజి నుంచి మళ్ళీ ఎటూ?" అన్నాడు మోహన్

"నాల్గింటిదాకా కాలేజిలోనే, ఆ తర్వాత ఎక్కడైనా రూమ్ దొరుకుతుందేమో ప్రయత్నించాలి" అన్నాను.

"యేం ప్రయత్నిస్తవులే... మా ఇల్లు పెద్దదే కొన్నాళ్ళు మాఇంట్ల ఉండు..."

"వద్దులేరా చాలాగ బాచిలర్స్ కొందరుంటారు. వాళ్లతో కలిసి ఉండిపోతాను"

"నేను బాచిలర్నే లేరా. నేనేమొ పెద్ద సంసారం వెంగబెడ్తున్నాననుకుంటున్నావా? నాల్గు రోజులు నీతోనన్నా సరదాగా గడిపే ఛాన్సివ్వు, నాల్గింటికి వస్తాను. నాకోసం వెయిట్ చేస్తుండు..." అంటూ మోహన్ కారును ముందుకు పోనిచ్చాడు.

మోహన్‌ను గూర్చి ఆలోచిస్తూ ప్రిన్స్‌పాల్ రూమ్ వైపు నడిచాను.

మోహన్ బి.ఏలో నా క్లాస్‌మేట్. హైదరాబాద్‌లో వాళ్ళ దగ్గరి బంధువులెవరో ఉన్నారని వాళ్ళ నాన్న మోహన్‌ను హైదరాబాద్‌లో చదివించాడు. అతడూ, నేను పక్క పక్క ఇళ్ళల్లో ఉండటం వలన అతనితో నాకు చాలా త్వరగానే స్నేహం యేర్పడింది. ఎవరితోనైనా కొంచెం చనువేర్పడితే చాలు, మోహన్ వాళ్ళను 'మామా!' అంటూ పిలిచే వాడు. అలా పిలిపించుకోవటం మొదట్లో నాకు చాలా అసహ్యంగా కనిపించినా, ఆ తర్వాత అందరిలాగే నేనూ మోహన్‌లోని ఆ ఆకర్షణీయమైన అమాయకత్వంతో ప్రభావితున్నయి పోయి, దాన్ని పట్టించుకో లేదు.

అతని మంచితనంతో ముఖ్యంగా భోలాతనంతో మోహన్ అందర్నీ ఇట్టే ఆకర్షించే వాడు. అతని అమాయకత్వాన్ని చూసి తెగ నువ్వుకునే వాళ్ళం.

ఒకరోజుమాకు ఇంగ్లీషు చెప్పే లెక్చరర్ ప్యాంట్ ముందు జిప్‌పైకి లాగటం మరచిపోయి క్లాసుకొచ్చాడు. ఆ లెక్చరర్ అంటే మా క్లాసులో అందరికీ భయమే. ముందు వరుసలో కూర్చున్న గర్ల్స్ ఆ దృశ్యాన్ని చూళ్ళేక తలలు వంచుకున్నారు. క్లాసులో చిన్న కలకలం ప్రారంభమైంది. అదేమీ గమనించకుండా లెక్చరర్ గారు పాఠం చెప్పుకుంటూ పోతున్నాడు. ఈ విషయం ఆయనకు ఎలా చెప్పాలా అని అందరమూ సతమతమై పోతోంటే మోహన్ టక్కున లేచి

"సార్... జర మీ పాంట్ జిప్ మంచిగ పెట్టుకోండి సార్! ముందు బెంచీలళ్ళ ఆడ పిల్లలున్నరు. జిప్ పెట్టుకోకుంట క్లాసుకొచ్చాడు. గలీజుగుంటది సార్..." అన్నాడు

క్లాసంతా ఒక్కసారి గొల్లుమంది. ఇంగ్లీషు మేష్టారు "సారీ...సారీ!" అంటూ వెంటనే సర్దుకున్నాడు.

మోహన్ ఎప్పుడూ ఆడపిల్లల్ని గమనిస్తుండే వాడు. వాళ్ళు అడక్కుండానే వాళ్ళకు చిన్న చిన్న పనులు చేసి పెడ్తుండేవాడు. కాలేజిలో క్లాసులయి పోయాక వాళ్ళు ఇళ్ళకు వెళ్తోంటే వాళ్ళకోసం రిక్షాలు మాట్లాడేవాడు. ఎవరికైనా రిక్షా దొరక్కపోతే తను చాలా దూరం వెళ్ళి రిక్షాలను పిల్చుకొచ్చేవాడు. వాళ్ళు సురక్షితంగా ఇళ్ళకు వెళ్ళారో లేదో చూసొచ్చేవాడు. వాళ్ళేదైనా చిన్న చిన్న వస్తువులను... పర్సులో, చేతి రుమాళ్ళో, చిల్లర డబ్బులో, నోట్ బుక్సో పోగొట్టుకుంటే వాటిని పట్టుకెళ్ళి వాళ్ళకు ముట్ట చెప్పేవాడు. ఎవరైనా రౌడీలు ఆడ పిల్లల్ని యేడిపించటానికి ప్రయత్నిస్తే మోహన్ వెళ్ళి వాళ్ళను బతిమిలాడి, వాళ్ళ కాళ్ళావేళ్ళాపడి, వాళ్ళను ఆడ పిల్లల జోలికి రాకుండా చేసేవాడు.


మోహన్‌ది చాలా అందమైన రూపం. ఐదు ఆడుగుల పది అంగుళాల పొడువు, తెల్లటి శరీర ఛాయ, నల్లటి ఉంగరాల జుట్టు తళతళ మెరిసిపోతుంటే పెద్దపెద్ద కళ్ళు, విశాలమైన నుదురు, గుండ్రటి మొహం, అందమైన మీసకట్టు-మొదటిసారి చూడగానే మనస్సులో శాశ్వతంగా ముద్రవేసే మనోజ్ఞమూర్తి అతనిది. మోహన్ రోజూ అద్దంలో తనను తాను చాలాసేపు చూసుకునేవాడు. ఎప్పుడూ మల్లెపువ్వులాంటి తెల్లని బట్టల్లో తళతళ మెరిసిపోతుండే వాడు.


మోహన్ సినిమాలు తెగ చూసేవాడు. హీరోయిన్ ఆపదలో ఉన్నప్పుడు హీరో వచ్చి ఆమెను రక్షించే దృశ్యాలు అతనికి భలే నచ్చేవి. అలాంటి దృశ్యాలు కనిపించినప్పుడల్లా బాగా ఎక్సైట్ అయిపోయి చప్పట్లు కొట్టేవాడు.

మోహన్‌లో ఉన్న ఒక గొప్ప గుణమేమిటంటే అతనిలోని సెన్సాఫ్ హ్యూమర్! అతని మీద మా మిత్ర బృందం ఎన్ని జోకులు వేసినా మాతోబాటు అతడు కూడా నవ్వేసేవాడే గానీ ఆఫెండయ్యేవాడు కాదు.

బి.ఏ చదివే రోజుల్లోనే మోహన్ ఒకసారి ప్రేమలో కూడా పడ్డాడు. మా క్లాసులో చదివే అమ్మాయిల్లో అందరికంటే అందంగా వుండే రమను ప్రేమించేశానన్నాడు. రాత్రింబవళ్ళు ఆ అమ్మాయిని గూర్చి కలలుగన్నాడు. ఆమెకో ప్రేమలేఖ రాసిపెట్టమని నన్ను చాలా రోజులు వేధించాడు. రమ కూడా నిన్ను ప్రేమిస్తోందన్న దాఖలా యేదన్నా వుంటే తప్ప ఆమెకు ప్రేమలేఖ రాయకూడదని, చాలా ఇబ్బందుల్లో పడిపోతావని నేను హెచ్చరించాను. ఆమె మోహన్ కేసి చూసి ఒకసారి నవ్విందట! అదొక్కటే మోహన్ ఆ అమ్మాయి తనను ప్రేమిస్తున్నదని అనుకోవడానికి ఆధారమైంది. తనకంటే ముందు ఆ అమ్మాయే తనకు ప్రేమలేక రాస్తుందని మోహన్ చాలా రోజులు ఎదురు చూశాడు. కాని ఇదంతా జరిగిన రెండు నెలల తర్వాత రమ పెళ్ళయిపోయిందని తెలిసింది.

ఆ రోజుల్లోనే మోహన్ తను లవ్‌మ్యారేజి తప్ప పెద్దలు కుదిర్చిన పెళ్ళి చేసుకోనని పదే పదే అంటుండేవాడు. అలాంటి మోహన్ పెద్దల బలవంతం మీద తనకిష్టం లేని పెళ్ళి చేసుకున్నాడంటే చాలా బాధ కల్గింది.




** ** **

ఆరోజు సాయంత్రం మోహన్ వచ్చి నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళాడు. ఆ ఇల్లు వాళ్ళ స్వంత ఇల్లేనని చెప్పాడు. ఇల్లు పెద్దదే కానీ చాలా పాతది. మోహన్ వాళ్ళ అమ్మ తరపు వాళ్ళ నుంచి ఆ ఇల్లు మోహన్‌కు సంక్రమించిందట. ఇంట్లో ఐదారు గదులున్నాయి. అందులో ఓ గదిని నాకు కేటాయించాడు.

"నువ్వెప్పుడొచ్చినా మా ఇంట్లో ఫ్రీగా ఉండొచ్చురా..." అన్నాడు మోహన్.

"ఇంతకూ మీ ఆవిడేది?" అన్నాను ఇంట్లో ఎవరూ లేరని గ్రహించి.

"తల్లిగారింటికి పోయ్యింది. అది లేదు కాబట్టే ఈ ఇల్లింత ప్రశాంతంగా వుంది. నిజం చెప్పాలంటే అది లేనప్పుడే-నాకు హాయిగా వుంటుంది"

"అంటే... పెళ్ళయినా బ్రహ్మచారి జీవితాన్నే కోరుకుంటున్నావన్నమాట!"

"ఏం పెళ్ళిరా? అదో పెళ్ళా? బలవంతంగా విషం తాగించడం... ఛీ ఛీ!''

ఆ సంభాషణను అంతటితో ఆపెయ్యడం మేలనిపించింది.

ఇద్దరమూ కాస్సేపు నిశ్శబ్దంగా వుండిపోయాం. ఆ తర్వాత బయటకు వెళ్ళి ఓ హోటల్లో భోజనం చేసి ఇంటికొచ్చి చాలాసేపు కబుర్లు చెప్పుకుంటూ ని(దపోయాం.

మోహన్ (ప్రతిమాటలోనూ ఒక విషయం స్పష్టంగా కనిపించింది. వాడికి వైవాహిక జీవితంలో ఎలాంటి ఆనందం లభించడం లేదు. అందువల్లనే వాడిలో విపరీతమైన అసంతృప్తి చోటుచేసుకుంది. తన జీవితంలో యేదో ఒక మహత్తరమైన సంఘటన జరుగుతుందని, దానితో తన జీవితం ఒక గొప్ప మలుపు తిరుగుతుందని అతడింకా ఎదురుచూస్తూనే వున్నాడు.

నేనా ఇంటికొచ్చిన పది రోజుల తర్వాత మోహన్ భార్య అరుణ వచ్చింది.

అరుణ పెద్ద అందగత్తేం కాదు. అలాగని మరీ వికారంగా కూడా లేదు. కాని ఎంతో అందంగా, సున్నితంగా వుండే మోహన్‌కు అరుణ యేవిధంగానూ తగిన జోడి అనిపించలేదు. అరుణ చాలా మొరటుగా కనిపించింది. ఆమె మాటలు, ఆమె చేతలు, ఆమె వేషం - అన్నింట్లోనూ మొరటుదనం కొట్టవచ్చినట్టు కనిపించింది.

ఆమె వచ్చిన రోజు మోహన్ ఇంటికి చాలా ఆలస్యంగా వచ్చాడు. మోహన్ అప్పుడప్పుడు తాగుతాడని నాకు తెలుసు. కాని ఆరోజు కొంచెం ఎక్కువే తాగాడు. అతడు వస్తూనే...

"యేమే దయ్యమా! అప్పుడే వచ్చినవా? పీడొక్కడే వుండి ఎక్కడ సుఖపడిపోతున్నడో నని వచ్చేసినవా? నీ అయ్య బాగున్నడేగా! ఇంకో నాల్గురోజులు నీకు తిండి బెట్టలేకపోయిండా?'' అన్నాడు మోహన్.

'గింతిష్టం లేనోడివి నన్నెందుకు జేసుకున్నవు?'' అంటోంది అరుణ.

"నేను జేసుకోలేదే పిచ్చిముద్దు! నీ అయ్య నా అయ్య కలిసి నన్ను నాకంట గట్టిండ్రు'' అన్నాడు మోహన్.

"నువ్వు గంత నంచిపిల్లగానివేంగాదు. అప్పుడే నేను జేసుకోనని ఎందుకుజెప్పలేదు. గిప్పుడు నన్నేంజెయ్యమంటవు'' అంది అరుణ.

"గంగంగలువు... గోవాల్లే మూసు... కానీ నా ఇంటికి మా(త్రం రాకు. నా కంటికి కనబడకు. నిన్ను చేసుకున్న కర్మానికి నెలకింత పంపమంటే పంపుతా'' అన్నాడు మోహన్.

"ఇదెక్కడి న్యాయంరో నాయనో..." అంటూ అరుణ పెద్దగా ఏడ్పులు తీస్తూ యేడవడం మొదలెట్టింది.

"ఎందుకేడుస్తున్నవే... దొయ్యమ్... అర్ధరా(త్రి పూట నాకొచ్చి పెళ్ళాన్ని కొడ్తున్న దని ముట్టుపక్కలోళ్ళు అనుకోవాల్నా? నోరు మూస్తావా? నిజంగనే నాల్గు తన్ని మంటావా?'' అన్నాడు మోహన్.

"తన్ను... యేపాటి తంతవో తన్ను... తన్నురా... తన్ను..." పెద్దగా అరిచింది అరుణ.

ఇక లాభం లేదని నేను వెంటనే బయటకొచ్చి "మోహన్! నువ్వొకసారిటురా!'' అని కేకేశాను.

మోహన్ వచ్చి నన్ను గట్టిగా కౌగలించుకొని 'చూడరా మామా! చూడు - నా బతు కెట్లయిపోయిందో చూడు!'' అంటూ యేడవడం మొదలెట్టాడు. ఆరోజు మోహన్ నేను వుంటున్న రూమ్‌లోనే పడుకొని ని(దపోయాడు. ఆ మర్నాడు నేను మోహన్‌ను బయటకు తీసికెళ్ళి చాలాసేపు అతనికి ఆమెను పెళ్ళి చేసుకున్నావు కాబట్టి ఎలాగైనా ఆమెతో అడ్జస్ట్ కావాలని నచ్చచెప్పడానికి (ప్రయత్నించాను.

"చిన్ననాటి కలల్ని మరచిపోవాలి. కలలకు వాస్తవానికి చాలా తేడా వుంటుంది. ఈ వయస్సులో కూడా నువ్వు కలల్లో జీవించడమే తప్ప వాస్తవ జీవితానికి అలవాటు పడక పోవడం నన్ను చాలా ఆశ్చర్యపరుస్తున్నది. ఇంకా నీ జీవితంలోకి ఎవరో వస్తారని, ఎవరో నిన్ను (ప్రేమిస్తారని, నీ కలలు నిజమౌతాయని ఎదురు చూడడం కేవలం పిచ్చి తప్ప మరొకటి కాదు. ఎవరో వస్తారని వున్న చాన్సు పోగొట్టుకోవడం చాలా అవివేకం...! ఇలా

దీపావళి శుభాకాంక్షలతో!

ఆత్మీయతతో కూడిన

ఆతిథ్యానికి, రుచికి, పరిశు(భతకు

ఫోన్: 30037

ఆనందభవన్ హోటల్

(బాడీపేట మెయిన్ రోడ్ గుంటూరు - 2

ఫౌండర్: ఎస్. రామస్వామి

ఈ ధోరణిలో అతనితో చాలాసేపు మాట్లాడాను. అయినా మోహన్‌లో ఎలాంటి మార్పు లేదు. అరుణ వున్నన్ని రోజులు రోజూ తాగి బాగా పొద్దుపోయాక ఇంటికొచ్చేవాడు. ఆమెతో పోట్లాడి నా రూమ్‌కొచ్చి పడుకునేవాడు. ఐదారు రోజుల తర్వాత అరుణ మళ్ళీ వాళ్ళ పుట్టింటికి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిపోయాక, ఒకరోజు "అసలు నువ్వేం చెయ్యదల్చుకున్నావు?" అని గట్టిగా అడిగాను.

"దానికి విడాకులిచ్చేస్తా..." అన్నాడు మోహన్.

"యూ ఆర్ ఎ ఫూల్! అరుణతో మంచిగా వుంటూ ఆమెను మార్చుకునే ప్రయత్నం చేస్తే బాగుపడ్తావు" అన్నాను.


"ఆ దయ్యమా! అది మారుతుందా?" అంటూ మోహన్ బయటకెళ్లి పోయాడు.

అరుణ వెళ్ళిపోయాక మోహన్ మళ్ళీ మామూలు మనిషైపోయాడు. తాగడం మానేశాడు. నాతో మళ్ళీ ఎప్పటిలా కబుర్లు చెప్పడం సాగించాడు.

** ** ** **

నేనా ఊరికొచ్చిన నెలరోజుల తర్వాత ఒకరోజు మోహన్ చాలా హుషారుగా కనిపించాడు. ఇంటికొస్తూనే నా రూమ్‌లో దూరబడి...

"ఈరోజు యేమైందో తెలుసా మామా! నేను ఎప్పట్నించో వెతుకుతున్న ఆ అమ్మాయి కనిపించింది" అన్నాడు.




'ఏ అమ్మాయిరా?'

"నేను ప్రేమించబోయే అమ్మాయి... నేను అప్పుడే మా మామునూర్ దాకా వెళ్ళొస్తున్న... అశోక్ టాకీసు దగ్గర కనిపించిందామె... ఎంతందంగా వుంద కున్నావు... కలలో కూడా చూళ్ళేదు. నన్ను చూడగానే నవ్వింది. చెయ్యూపింది. నేను కొంచెం ముందుకెళ్ళి, సైడ్ తీసుకొని కారాపి వెనక్కి చూస్తే ఆమె లేదు."

"అంతలోనే ఎక్కడ మాయమౌతుంది?"

"అదే... అదే... .. అర్థం కాలేదు. అక్కడున్న యే షాపులోనన్నా దూరిందేమోనని ఆ షాపులన్నీ వెతికాను. కానీ ఆమె కనిపించలేదు."

"అంతా నీ భ్రమేరా! పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యడం మానెయ్..."

"భ్రమకాదు... కానేకాదు... నేను స్వయంగా నాకళ్ళతో చూసిన... ఆమె నన్నే చూసింది. నవ్వింది. నన్ను తనవైపు పిలుస్తున్నట్టుగా చెయ్యూపింది. ప్రామిస్‌రా! ఒట్టు... అమ్మతోడు...నా మాట నమ్ము..."

"తన వాళ్ళెవర్నో చూసి నవ్వుంటుంది. లేకపోతే ఎవరో పిచ్చిదైనా అయ్యుంటుంది& లేకపోతే యే ప్రాస్టిట్యూటో..."

"నోర్ముయ్... పిచ్చి పిచ్చిగా మాట్లాడినావంటే తంతా..." అంటూ, మోహన్ నా కాలర్ పట్టుకొని ఇంచుమించు నన్ను తన్నినంత పనిచేశాడు. వాడికి నామీద అంత కోపం రావడం అదే మొదటిసారి.

ఆ తర్వాత మోహన్ వారం రోజుల దాకా నాతో మాట్లాడలేదు. ఆ వారం రోజులూ వాడేం చేస్తున్నాడో నాకు తెలుస్తూనే వుంది. అశోక్ టాకీసు చుట్టు ప్రక్కలున్న షాపులన్నీ రోజూ వెతికాడు ... కాని ఆమె కనిపించలేదు - వారం రోజుల తర్వాత మోహన్ నాదగ్గరకొచ్చి...

"ఆమెనీరోజు బస్టాండు దగ్గర చూసిన... చాలా దగ్గర్నుంచి చూసిన... నేను కారు పార్క్ చేసి వెళ్ళేటప్పటికి ఆమె హైదరాబాద్ వెళ్తున్న బస్సులో వెళ్ళిపోయింది" అన్నాడు.

'అయ్యోపాపం!' అన్నాన్నేను చాలా సీరియస్‌గా.

"ఒక్క నిముషం ముందైతే ఆమెను పట్టుకునే వాడిని..."

"ఈసారి కూడా నిన్ను చూసి నవ్విందా?"

"సరిగ్గా ఇదివరకటిలాగే... నన్ను చూడగానే నవ్వింది, చెయ్యూపింది."

నేను నవ్వాను. నా నవ్వులో కొంచెం వెటకారం ధ్వనించింది.

"నువ్వు నమ్మడం లేదని నాకు తెలుసురా! కాని నా ఇష్టదైవమైన యాదగిరి నరసింహస్వామి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. ఆమె నాకు నిజంగా కనిపించింది. నన్ను తన దగ్గరకు రమ్మన్నట్టుగా చెయ్యూపింది" నెత్తిమీద చెయ్యి పెట్టుకొని ప్రమాణం చేస్తూ అన్నాడు మోహన్.

"అలా చెయ్యూపిన మనిషి నిన్ను కలుసుకోకుండానే ఎందుకు తప్పించుకు పోతున్నట్టు..."

"ఇంతమాత్రం అర్థం చెసుకోలేవా? ఆమె నాకో పరీక్ష పెడ్తున్నది. ఆమె నన్ను చాలా కాలంగా గమనిస్తున్నది. ఆమెకు నా గురించి అంతా తెలుసు. నేనే ఆమె గురించి యేమీ తెలుసుకోలేక పోతున్నాను. అజ్ఞానంలో వున్నాను. ఆమెను గురించి తెలుసుకొని నా అజ్ఞానాన్ని దూరం చేసుకున్ననాడు నేనామెను చేరుకునే అర్హతను సంపాదిస్తాను. అప్పుడే నన్నామె ఆదరిస్తుంది. అప్పుడే ఆమె, నేనూ ఒకటౌతాము." చాలా గంభీరంగా అన్నాడు మోహన్.

నాకు వాడ్ని చూస్తే భయమేసింది.

"ఒరేయ్ మోహన్! నీకు పిచ్చి బాగా ముదిరి పోతోందిరా! నిన్ను చూస్తోంటే నాకు నిజంగా..."

"నువ్వలాగే అంటావురా... ఇంకో పదిరోజులాగితే నేనిందుకిలా మాట్లాడుతున్నానో నీకే అర్థమౌతుంది. ఈ పది రోజుల్లో ఆమె ఈ భూలోకంలో ఎక్కడున్నా ఆమెను చేరుకుంటాను. నా దాన్ని చేసుకుంటాను."

"ఉన్నదాన్నేం చేస్తావురా?"

"దానికెప్పుడో చెప్పాను... విడాకులిచ్చేస్తానని..."

"నిన్ను చూస్తే జాలేస్తోందిరా..."

"ఎందుకు?"

"చేజేతులా నీ జీవితాన్ని పాడుచేసుకుంటున్నందుకు... ఎండమావుల్ని వేటాడు తున్నందుకు..."

"పాడు చేసుకోవడం లేదు. పాడైన జీవితాన్ని బాగుచేసుకుంటున్నాను" అంటూ వెళ్ళి పోయాడు మోహన్.

****

పది రోజులు గడిచిపోయాయి.

మధ్యలో ఒకసారి మోహన్ భార్య అరుణ వచ్చి, ఎప్పటిలాగే రెండ్రోజులుండి వెళ్ళి పోయింది. దసరా సెలవులొస్తే నేనొక వారం రోజులు హైదరాబాద్ వెళ్ళొచ్చాను.

నేను హైదరాబాద్ నుండి రాగానే మోహన్ నన్ను తన కార్లో ఎక్కించుకొని చాలా హుషారుగా చెప్పటం మొదలుపెట్టాడు.

"నీ కోసమే చూస్తున్నాను మామా! నీకో ముఖ్యమైన విషయం చెప్పాలి" అన్నాడు మోహన్. వాడి కళ్ళల్లో ఒక కొత్త కాంతి కనిపించింది. వాడు వెతుకుతున్న ఆ అమ్మాయి వాడికి కలిసి వుంటుంది. ఆ అమ్మాయి నిజంగా వుందా? వాడికి ఆమెతో పరిచయ మైందా?

ఊరికి దూరంగా తీసికెళ్ళి రోడ్డు కిందకు దిలిపి కారాపాడు మోహన్.

"ఒరేయ్! ఇప్పుడన్నా నమ్ముతావా? నాకు కనిపించిన అమ్మాయి నిజంగా వుందని"

ఇప్పుడేమయింది? ఆమె నీకు పరిచయమైందా?"

"అవుతుంది... త్వరలోనే అవుతుంది... ఇదిగో చూడు..." అంటూ జేబులోంచి ఓ కవరు తీసి నా చేతికిచ్చాడు. "ఈ కవరు నిన్ననే నాకు పోస్టులో వచ్చింది. దాంట్లో వున్న ఉత్తరం తీసి చదువు. నీకు తప్ప ఈ ఉత్తరాన్ని ఇంకెవరికీ చూపించలేదు..." అన్నాడు మోహన్.

కవరులో ఉత్తరం తీసి చదివాను.

మైడియర్ మోహన్!

ఎవరా అని ఆశ్చర్యపడిపోతున్నావు కదూ? నిన్ను చూస్తే నిజంగా జాలేస్తున్నదోయ్... నన్నింకా తెలుసుకోలేక పోతున్నావు... నిన్ను నా దగ్గరకు చేర్చుకోవాలని నేనెంత

ప్రయత్నించినా నన్ను చేరుకోలేక పోతున్నావు. నీ అజ్ఞానంలోంచి, నీ ఇరుకు ప్రపంచం లోంచి బయట పడలేకపోతున్నావు. నీ కోసం... కేవలం నీ కోసం ఈ భూలోకంలో అడుగుపెట్టిన నన్ను ఇంకా తెలుసుకోలేకపోతున్నావు. యుగయుగాలుగా నీ కోసం అన్వేషిస్తున్న నన్ను గుర్తించలేకపోతున్నావు.

నువ్వెంత అజ్ఞానివి ప్రియా!

నీ కోసం చాచిన ఈ చేతుల్ని అందుకోలేక పోతున్నావు. నీ కోసం చిందించిన నా చిరునవ్వులోని కాంతులతో నీలో దట్టంగా పేరుకుపోయిన అంధకారాన్ని తొలగించుకోలేక పోతున్నావు. నువ్వు నన్ను తెలుసుకునేంత వరకు, నన్ను చేరుకునేంత వరకు నేను నీకు లభించను.

నీ కొక ఆఖరు అవకాశం ఇస్తున్నాను.

ఈ నెల పదహారో తేదీనాడు నేను నీకు ఈ ఊరి శ్రీదేవి థియేటర్ దగ్గర కనిపిస్తాను. సరిగ్గా సాయంత్రం ఆరుగంటలకు ఐదు రూపాయల బుకింగ్ దగ్గరుంటాను. నన్ను నీ అంతట నువ్వే గుర్తించి 'హలో! నీ కోసమే వెతుకున్నా!'' అనాలి. అప్పుడు నువ్వు నీకు చాలా చిరపరిచితమైన నా చిరునవ్వును అందుకుంటావు. అప్పుడు మనిద్దరం కలిసి నీ కార్లో మన కోసం నిరీక్షిస్తున్న మన మరో ప్రపంచంలోకి వెళ్ళిపోదాం.

సరిగ్గా ఆరు గంటలకు రావాలి. ఒక్క నిమిషం ముందైనా, ఒక్క నిమిషం వెనుకైనా నేను నీకు కనిపించను.

ఈసారి నేను ఇదివరకటిలా నిన్ను చూడగానే చిరునవ్వు నవ్వను- వెయ్యాపను. నీ అంతటి నువ్వే నన్ను తెలుసుకొని పలకరించాలి. నన్ను నువ్వు నిజంగా ప్రేమిస్తే, నీ ప్రేమ నిజమైందీ, ఉన్నతమైందీ అయితే, నన్ను నువ్వు చాలా సులభంగానే గుర్తిస్తావు. నీ ప్రేమకు నేను పెడుతున్న ఈ చిన్నపరీక్షలో నువ్వు నెగ్గి తీరాలి. ఈ పరీక్షలో నువ్వు నెగ్గకపోతే పురూరవున్ని వదిలేసి వెళ్ళిపోయిన ఊర్వశిలా వెళ్ళిపోతాను.

నీ కోసం యుగయుగాలుగా అనుక్షణం ఎదురుచూస్తున్న ...

నీ

మనోరమ

**P.S**: ఈ ఉత్తరం టాప్ సీక్రెట్. ఎవరికీ చూపించొద్దు. అలా చూపిస్తే నేను నీకు దక్కను.

ఉత్తరం చదవడం పూర్తి చేసి వాడికేసి చూశాను.

మోహన్ వెంటనే నా చేతుల్లోంచి ఆ ఉత్తరాన్ని, కవరును లాగేసి భద్రంగా తన జేబులో దాచుకున్నాను.

ఆ ఉత్తరంలోని దస్తూరిని మరోసారి పరిశీలించాలనిపించింది. ఉత్తరంలోని ఒక్కొక్క అక్షరాన్ని కుదిరించి రాయటానికి చాలా శ్రమపడ్డారనిపించింది.

''ఆ ఉత్తరాన్ని మరోసారిస్తావా?'' అన్నాను.

''ఒకసారివ్వటమే పొరపాటు... మరోసారి చచ్చినా ఇవ్వను'' అన్నాడు మోహన్ జేబులోవున్న ఉత్తరం మీద చెయ్యిపెట్టుకొని.

''ఇప్పుడైనా నమ్ముతావా?'' అన్నాడు నాకేసి గొప్ప విజయ గర్వంతో చూస్తూ.

'ఇప్పుడు నమ్మను - కానీ రేపు 16వ తేదీనాడు థియేటర్ దగ్గర ఆ అమ్మాయి కనిపించి నీ కారెక్కినప్పుడు నమ్ముతాను'' అన్నాను.

''అహ్హహ్హహ్హ... ఆ రోజు నువ్వు కూడా ఎక్కడైనా ఆ థియేటర్ దగ్గర్లో ఎవరికీ తెలియకుండా మమ్మల్ని చూస్తుండు ... ఆమె నా కారెక్కడం స్వయంగా నీ కళ్ళతో చూద్దువుగాని''

''ఓ.కె. అలాగే'' అన్నాన్నేను.

****          ****

పదహారో తేదీ రావడానికి కింకా వారం రోజులుంది. మోహన్ ఈ లోగా చాలా హంగామా చేశాడు. కొత్త బట్టలు కుట్టించుకున్నాడు. తన అలంకరణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడు. కారు శుభ్రంగా కడిగించి తళతళ మెరిసిపోయేలా చేశాడు. ఎక్కడికి వెళ్ళినా అతని కళ్ళు వెతుకుతూనే వున్నాయి. ఎక్కడ అందమైన స్త్రీ కనిపించినా అతని గుండె కాస్సేపు కొట్టుకోవడం మరచిపోతున్నది.

ఆ మనోరమ తనను నీడలా వెంటాడుతున్నదని అతని నమ్మకం. అతడు ఎక్కడకు వెళ్ళినా, యేం చేస్తున్నా ఆమె తనను గమనిస్తున్నదని అతడు భావించాడు.

'ఇంకెన్ని రోజులు తప్పించుకుంటావులే. ఈసారి నిన్ను తప్పకుండా చేరుకుంటాను'' అంటూ తనలో తనే మాట్లాడుకుంటూ ఆమెతో మాట్లాడుతున్నట్టుగా ఫీలయ్యే వాడు.

''మనం పెళ్ళి చేసుకోగానే హనీమూన్‌కు వెళ్ళిపోదాం. ఎక్కడికి వెళ్తే బావుంటుందో నువ్వే చెప్పాలి''.

''నీ దగ్గర అంత డబ్బెక్కడిదని అంటావా? కారు అమ్మేస్తాను. ఇంటిని తాకట్టు పెడతాను''

ఇలా ఎప్పుడూ ఆమెనుగూర్చి కలలు గంటూ ఆ వారం గడిపాడు. 16వ తేదీ వచ్చేలోగా వాడికి పిచ్చెక్కుతుందేమోనని భయమేసింది.

చివరకు పదహారో తేది వచ్చేసింది.

ఐదు గంటల యాభై ఐదు నిముషాలకే నేను శ్రీదేవి టాకీసు దగ్గరకు చేరుకున్నాను. బుకింగ్ దగ్గర పెద్దగా రద్దీ యేమీ లేదు. యేదో పాతపిక్చర్ ఆడుతున్నది. ఒక్కొక్కరే వచ్చి టికెట్స్ తీసుకొని లోపలకు వెళ్ళిపోతున్నారు.

ఆరు గంటలయింది. మోహన్ వచ్చేస్తాడనుకొని గేటు కేసి చూడసాగాను. ఆరు దాటి ఒక నిమిషమైనా మోహన్ రాకపోవడం చాలా ఆశ్చర్యాన్ని కల్గించింది. సరిగ్గా ఆరింటికి ఇద్దరు ఆడపిల్లలొచ్చి టికెట్స్ తీసుకొని లోపల కెళ్ళి పోయారు. కానీ ఆ ఇద్దరూ పెద్ద అందగత్తెలేం కాదు.

మోహన్ ఎందుకు లేటయ్యాడు? వాడొచ్చి ఆ అమ్మాయి కనిపించకపోతే ఏమై పోతాడు?

ఆరు గంటలు దాటి రెండు నిమిషాలు... మూడు నిమిషాలు... నాల్గు నిమిషాలు...

అప్పుడొచ్చింది మోహన్ నడుపుతున్న కారు గేట్లోంచి దూసుకొని... అంత రాష్‌గా లోపలకు దూసుకొని వచ్చిన ఆ కారుకేసి అక్కడున్న వాళ్ళంతా ఆశ్చర్యంగా చూశారు.

కారు పార్కు చేసి, కార్లోంచి గెంతి, పరిగెత్తుతున్నట్టు ఐదు రూపాయల బుకింగ్ వైపు నడిచాడు మోహన్.

అప్పుడు బుకింగ్ దగ్గర ఎవ్వరూ లేరు.

ఒక రెండు నిమిషాల సేపు ఆ ఆవరణలో వున్న వాళ్ళందర్నీ కలియజూశాడు. ఎవ్వరి




మీదా అతని దృష్టి నిలువలేదు. ఇంతలో ఓ ఇరవయ్యేళ్ళున్న అమ్మాయి... కాస్త అందంగానే వుంది. బుకింగ్ దగ్గర కొచ్చింది. ఆమెను చూడగానే మోహన్ ముఖం ప్రకాశించింది. ఆమెకేసి సూటిగా చూస్తూ ''హల్లో...'' అన్నాడు.

మరుక్షణంలో స్కూటర్ పార్క్ చెయ్యడానికి వెళ్ళిన ఆ అమ్మాయి భర్త వచ్చి మోహన్‌కేసి కోపంగా చూస్తూ ''ఎవరు మీరు? మీకేం కావాలి?'' అన్నాడు.

''సారీ... సారీ..'' అంటూ తనలో తను గొణుక్కుంటూ మోహన్ అక్కణ్ణించి వెళ్ళిపోయి బుకింగ్‌కు కొంచెం దూరంగా నిల్చున్నాడు.

ఇంకో ఇరవై నిమిషాల వరకూ అక్కడే నిల్చొని వచ్చి పోయే వాళ్ళందర్నీ గమనించాడు. వాడి మనోరమ రాలేదు.

ఆరున్నర తర్వాత నేను మెల్లగా వెళ్ళి వాడి పక్కన నిల్చున్నాను. నన్ను చూడగానే మోహన్ కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

''పెద్ద పొరపాటు జరిగిపోయిందిరా'' అన్నాడు.

'యేమైంది?'

'నేను నాల్గు నిమిషాలు ఆలస్యంగా వచ్చాను. వస్తుంటే దార్లో చిన్న యాక్సిడెంటయింది. కొంచెం ఫాస్ట్‌గా వస్తున్నాను. సడెన్‌గా ఓ రిక్షావాడు అడ్డమొచ్చాడు. వాడిని గుద్దేశాను. వాడు చచ్చాడనుకున్నాను. వాడికేమీ కాలేదు గానీ వాడి రిక్షా మాత్రం పాడై పోయింది. రిక్షా వాళ్ళంతా గుమిగూడారు. వాళ్ళ మొఖాన కొంద రూపాయలు పడేసి, వాళ్ళను వదిలించుకొని వచ్చేటప్పటికి ఆలస్యమైపోయింది. ఆమె వెళ్ళి పోయింది. ఆమె




పెట్టిన పరీక్షలో నేను మరోసారి ఫెయిలయిపోయాను...''

"మోహన్! ఇంకా నిన్ను నువ్వు మోసం చేసుకోవడానికి ప్రయత్నించకు. నేను ఐదు నిముషాలు తక్కువ ఆరింటికే ఎప్ప ఆ బుకింగ్ దగ్గర నిల్చున్నాను. అప్పట్నించి ఇప్పటి వరకు నువ్వు పలకరించి భంగపడ్డావే... ఆ అమ్మాయి కంటె అందమైన వాళ్ళెవరూ రాలేదు. అసలు ఆ మనోరమ అంటూ ఎవరైనా వుంటేకద రావడానికి! నీకొచ్చిన ఆ ఉత్తరమొక పెద్ద ఫ్రాడ్... నిన్ను యేడిపించడానికెవరో ఆడుతున్న నాటకం...''

"కాదు... కాదు... ఫ్రాడ్ కాదు... నాటకం కాదు. ఆ ఉత్తరం ఆపిల్లే రాసింది. నా రమ రాసింది. నా మనోరమ రాసింది. నా మనోరమ వుంది. నా కోసం వచ్చింది. కాని నేను ఆమె పెట్టిన షరతు ప్రకారం సరిగ్గా ఆరింటికి రాలేకపోవడం వల్ల నన్ను శిక్షించింది. అంతే... అంతే... నేనో ఫూల్‌ని... నేనో దౌర్భాగ్యుణ్ని... ఇంత చిన్న పరీక్షలో నెగ్గలేకపోయిన నన్ను నా మనోరమ క్షమించదు...''

బాధతో వాడి మొఖం వివర్ణమైపోయింది. ఎప్పుడూ నిండు జీవంతో కళకళలాడే వాడి మొహం నల్లగా, నిర్జీవంగా మారిపోయింది. వస్తున్న దుఃఖాన్ని వాడు ఎంతో ప్రయత్నంతో ఆపుకోగల్గాడు.

"సరే మోహన్! నేను చెప్పేది కాస్త వింటావా?''

'వినను... నువ్వు నాకేమీ చెప్పొద్దు. నీకసలు నేనా ఉత్తరం చూపించడం కూడా పెద్ద పొరపాటు. ఈ విషయం ఆమె తెలుసుకొని వుంటుంది. ఆమె రాకపోవడానికి అది కూడా ఒక కారణమే'' అంటూ వాడు విసురుగా వెళ్ళి కారు స్టార్ట్ చేసి ఎలా వచ్చాడో అలాగే చాలా దూకుడుగా కారును గేటు బయటకు పోనిచ్చాడు.

** ** ** ** **

వారం రోజులు గడిచాయి.

ఈ వారం రోజుల్లో మోహన్ ఊరి వీధులన్నీ కాలుగాలిన పిల్లిలా తిరుగుతూనే వున్నాడు. కారును కిరాయికి నడపడం కాకుండా తను తిరగడానికి, ఆ అమ్మాయిని వెతకడానికి ఉపయోగించాడు. పెట్రోలు మీద బోల్డు డబ్బు తగలేశాడు. నిద్రాహారలు మానేశాడు. రాత్రుళ్ళు విపరీతంగా తాగడం, తనను తాను నిందించుకుంటూ బోరుమని యేడ్వడం - మానవ మాత్రుడెవరికీ వాడిని బాగుచెయ్యడం సాధ్యమౌతుందనిపించ లేదు.

ఒకరోజు నేను కాలేజి కెడ్తొంటే మోహన్ లాగే కారును అద్దెకు నడిపే గోపాల్ కనిపించి 'సార్! మీతో కాస్సేపు మాట్లాడాలి' అన్నాడు.

"ఏమిటి సంగతి?'' అన్నాను.

"కాస్సేపు మనమీ హోటల్లో కూర్చుందాం రండి'' అంటూ అతడు రోడ్డుకు కొంచెం దూరంలో వున్న హోటల్‌కు దారి తీశాడు. గోపాల్‌ను మోహన్‌తో చాలా సార్లు చూశాను. వాళ్ళిద్దరూ మంచి స్నేహితులు. సినిమాలకు, హోటళ్ళకు కలిసే వెళ్తారు. గోపాల్ కూడా బి.ఏ. పాసయ్యాడు. మోహన్‌లాగే బ్యాంక్ లోన్‌తో కారుకొని కిరాయిలకు నడుపుతున్నాడు.

హోటల్లో కెళ్ళి ఖాళీగా వున్న టేబుల్ దగ్గర కూర్చున్నాము.

"ఏమిటో త్వరగా చెప్పు. కాలేజికి టైమౌతోంది'' అన్నాను.

"మోహన్ పూర్తిగా చెడిపోతున్నాడు సార్! కారేసుకొని ఊరంతా పిచ్చిగా తిరగడం తప్ప కిరాయికి పోవడం లేదు. రెండు నెలల నుంచి లోన్ ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టలేదు''.

"ఔను - నాకు తెలుసు... వాడికి ఎన్నోవిధాలుగా నచ్చచెప్పడానికి ప్రయత్నించాను... కాని, లాభం లేదు. వాడికెవరో మనోరమ అనే అమ్మాయి ఒక మిశ్చవస్ లెటర్ రాసింది. దాంతో వాడా మనోరమను వెతుక్కుంటూ పిచ్చెత్తిన వాడిలా తిరుగుతున్నాడు...''

"మనోరమ పేరుతో ఆ ఉత్తరం రాసింది నేనే సార్!'' అన్నాడు గోపాల్.

"నువ్వా! ఎందుకంత పిచ్చిపని చేశావు'' అన్నాను.

"మోహన్ ఎప్పుడూ నాకు బస్సు స్టాండ్‌లో ఓ అందమైన పిల్ల కనిపించి చెయ్యూపిందని, శ్రీదేవి టాకీసు దగ్గర శ్రీదేవిలా వుండే ఓ అమ్మాయి తనను చూసి చిరునవ్వు నవ్విందని చెప్తుండేవాడు. వాడిని కొంచెం యేడిపిద్దామని నాకా ఉత్తరం రాయాలన్న ఐడియా వచ్చింది. అది నేను స్వయంగా రాసిన ఉత్తరం కూడా కాదు. ఆ మధ్య ఓ వారపత్రిక తిరగేస్తుంటే ఒక కథలో ఆ ఉత్తరం కనిపించింది. అది చదవగానే మోహన్‌కు అలాంటి ఉత్తరం రాస్తే భలేగా వుంటుందని పించింది. ఆ ఉత్తరాన్ని జాగ్రత్తగా కాపీ చేసి, అక్కడక్కడ కొంచెం మార్చి వాడికి పోస్టు చేశాను. దాన్ని వాడింత సీరియస్‌గా తీసుకొని చెడిపోతాడని కలలో కూడా ఊహించలేదు...'' అన్నాడు గోపాల్.

'వాడికింతకాలం ఈ విషయం ఎందుకు చెప్పలేదు?''

"చెప్పే అవకాశం వాడెక్కడిస్తున్నాడు సార్! అప్పటికే రెండు మూడుసార్లు నవ్వుతూ ఆ ఉత్తరం నేనే రాశానని చెప్పాను. కానీ వాడు నమ్మటం లేదు...''

"ఔను వాడంత సులభంగా నమ్మడు"

ఇద్దరమూ ఒక నిమిషం సేపు ఆలోచిస్తూ కూర్చున్నాము.

"ఆ ఉత్తరం రఫ్ కాపి ఒకటి నా దగ్గరుంది సార్. ఆ ఉత్తరం ఉన్న వారపత్రిక కూడా ఉంది" అన్నాడు గోపాల్

"వాటిని చూపిస్తేనన్నా వాడు నమ్మొచ్చు. వాటిని తీసుకుని సాయంత్రం ఐదు గంటల వరకు ఇంటికిరా... వాడిని తీసుకొని యే హోటల్‌కైనా వెళ్ళి వాడికర్థమయ్యేలా అసలు విషయమేమిటో చెబుదాం" అంటూ లేచాను.

గోపాల్ కూడా లేచి "అలాగే సార్! సాయంత్రం ఐదు గంటలకొస్తాను. వాడా టైమ్‌కి ఇంట్లో ఉండేట్టుగా చూడండి" అంటూ వెళ్ళిపోయాడు.

ఆరోజు సాయంత్రం ఐదు గంటలకు నేను ఇంటికి వెళ్ళగానే మోహన్ కూడా వచ్చాడు.

"నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి. బయటకు వెళ్దాం పద" అన్నాను.

"యే విషయం?" అన్నాడు మోహన్

"నీ మనోరమ విషయం"

"మనోరమ విషయం నీకెందుకు?"

"నీ మనోరమ ఎవరో తెలిసింది"

"నిజంగా? ఎక్కడుందామె? నన్ను క్షమించిందా? నీతో మాట్లాడిందా?" ఎంతో ఆశగా, ఆతురతగా అడిగాడు మోహన్.

"అన్నీ చెబుతాను... మొదలు బయటకెళ్దాం పద" అన్నాను.

"పద... ఇప్పుడే వెళ్దాం" అన్నాడు మోహన్

"ఒక్క నిముషం నేను మొహం కడుక్కొని వస్తాను" అంటూ లోపలకెళ్ళాను.

నేను మళ్ళీ బయటకొచ్చేసరికి గోపాల్ వచ్చేశాడు.

ముగ్గురమూ గోపాల్ కార్లో అశోకా హోటల్‌కు వెళ్ళి కూర్చున్నాము. నేను మెల్లగా మొదలెట్టాను.

"మోహన్! వాస్తవం కంటె భ్రమ చాలా అందంగా ఉంటుంది. నిజమే కాని సాధ్యమైనంత త్వరగా ఆ భ్రమలోంచి బయట పడకపోతే జీవితం నాశనమైపోతుంది" అన్నాను మోహన్‌కేసి చూస్తూ

"ఇదంతా పాత పాటేగా! ఇది చెప్పటానికే నన్నిక్కడి దాకా తీసుకొచ్చావా?" అంటూనే మోహన్ లేచిపోవటానికి సిద్ధమయ్యాడు.

"కూర్చో! నీ మనోరమ ఎవరో తెలుసుకోకుండానే వెళ్ళిపోతావా? నీకా ఉత్తరం రాసిన ఆ అందాల మనోరమ ఎవరనుకున్నావు? ఇదిగో ఈ గోపాలే!" అన్నాను.

కాని నేనన్న మాటలు మోహన్‌కు యేమాత్రం కూడా అర్థమయినట్టు తోచలేదు. మోహన్‌లో ఎలాంటి చలనం లేదు. గోపాల్‌కేసి, నాకేసి చూడటం తప్ప అతడేమీ మాట్లాడలేదు.

"నిజంగా మోహన్! అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు. నిన్నో ఆట పట్టించాలని ఈ గోపాలే నీకా ఉత్తరం రాశాడు. కావాలంటే గోపాల్ దస్తూరిని, నీ ఉత్తరం లోని దస్తూరిని పరీక్షించి చూడు..." అన్నాను.

"ఆ ఉత్తరం రఫ్ కాపీ కూడా నా దగ్గరుంది. ఇదిగో చూడు" అంటూ గోపాల్ తన జేబులో ఉన్న ఓ కాగితాన్ని తీసి మోహన్ చేతికివ్వబోయాడు. కాని మోహన్ ఆ కాగితాన్ని గోపాల్ దగ్గర్నుండి తీసుకోలేదు. వెంటనే దిగ్గున లేచి గోపాల్ కాలర్ పట్టుకొని అతన్ని తన శక్తికొద్దీ కొట్టటం మొదలెట్టాడు.

"ఎవడ్రా నువ్వు? నీకూ నా మనోరమకు యేమిట్రా సంబంధం... మరోసారి నన్నిలా మోసం చేశావో నిన్ను చంపేస్తాను. నిన్ను నరికి పోగులు పెడ్తాను. దొంగ గాడిద కొడుకా..."

కన్నుమూసి తెరిచేలోగా జరిగిన ఈ సంఘటనతో నేను స్తంభించి పోయాను. కొన్ని సెకండ్ల వరకు నాకేం చెయ్యాలో తోచలేదు.

"మోహన్! యేమిటిది అతన్ని వదులు... అతన్ని వదులు..." అంటూ వాళ్ళిద్దర్నీ విడదీయటానికి ప్రయత్నించాను. ఆ హోటల్లో ఉన్న వాళ్ళందరూ మమ్మల్నే చూశారు.

"ఆ ఉత్తరం వీడు రాయలేదు. మనోరమే రాసింది. మీరిద్దరూ కలిసి నన్ను నా మనోరమ నుండి విడదీయటానికి కుట్ర పన్నుతున్నారు. కాని నన్ను మీరు మోసగించలేరు. ఈ ప్రపంచంలో ఎవరూ నన్ను నా మనోరమ నుండి వేరు చెయ్యలేరు"

ఇంకా గోపాల్ కాలర్ పట్టుకునే మోహన్ అరిచినట్టుగా అన్నాడు.

"ప్రమాణం చేసి చెబుతున్నాను. నీకూ నాకూ ఇష్ట దైవమైన యాదగిరి నరసింహస్వామి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. ఆ ఉత్తరం నేనే రాశాను..." అన్నాడు గోపాల్

మరుక్షణంలో గోపాల్ చెంప ఛెళ్ళుమంది. మోహన్ పిచ్చెత్తిన వాడిలా గోపాల్ మీద పడి మళ్ళీ కొట్టటం మొదలెట్టాడు. నేను మళ్ళీ వాళ్ళిద్దర్ని విడదీయటానికి ప్రయత్నించాను.

"మోహన్! నీకేమన్నా పిచ్చెక్కిందా...?" అన్నాను

అతన్ని గోపాల్ నుండి విడదీసి వెనక్కి నెట్టేస్తూ

"ఔను పిచ్చెక్కింది. మీరు నాకు అబద్ధాలు చెప్పి పిచ్చెక్కిస్తున్నారు. అరేయ్ గోపాల్! మరోసారి ఆ ఉత్తరం గురించి చెప్పావో నీ చేత రక్తం కక్కిస్తాను. యే ఎముకకు ఆ ఎముక విరిచేస్తాను. జాగ్రత్త!"

పెద్దగా అరుస్తూ మోహన్ ఆ హోటల్లోంచి బయటకెళ్ళిపోయాడు.

అక్కడున్న జనమంతా మా చుట్టూ గుమిగూడి 'యేం జరిగిందంటే యేం జరిగింద'ని నన్నూ గోపాల్‌ను అడగసాగారు.

గోపాల్, నేనూ ఒకరి మొహాలొకరం చూసుకుంటూ ఆ హోటల్లోంచి బయటకు నడిచాము.

●

# మంకెన పువ్వు

చిక్కని ఆకుపచ్చని చీకటి రాత్రి గుబుర్లలో విరిసిన
ఒకానొక రేపట విప్పపువ్వు నీ నవ్వు
నీ ఆత్మ తేజో రుధిరపు మంకెన పరాగాన్ని
నీ కన్నీటి ప్రమిదలోంచి కాంచలేని
అంధకుడ్ని అందుకనే ఈదులోన్నాను
అమావాస్యనాడు అలల ఘోషకి
తాకిడిన చెక్కిళుల చీకటులలో

'మో'

